గుజరాత్ సీఎంను కలిసిన రహమతుల్లా



సుల్తాన్‌బజార్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఆ రాష్ట్ర సీఎం భూపేంద్ర బాయ్ పటేల్‌ను తెలంగాణ రాష్ట్ర బీజేపీ మైనార్టీ మోర్చా కోశాధికారి డాక్టర్ రహమతుల్లా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో 17 పార్లమెంట్ సీట్లలో విజయం సాధించేలా కృషి చేస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రహమతుల్లాను అభినందించారు.

విరించిలో వైద్య సేవలపై రాయితీ



మాధవీలతకు వినతి పత్రం ఇస్తున్న ప్రతినిధులు

చార్మినార్: నార్నోల్ అగర్వాల్ సమితి తరఫున తమ సభ్యులందరికీ వైద్య సేవలపై విరించి ఆసుపత్రి చైర్ పర్సన్ మాధవీలత రాయితీ ప్రకటించారని సమితి అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ తెలిపారు. గురువారం తాము ఆమెకు వినతి పత్రం అందజేయగా వెంటనే స్పందించారన్నారు. అవుట్ పేషంట్లకు 35 శాతం, ల్యాబ్ డయాగ్నోస్టిక్‌లపై 20 శాతం, ఇన్ పేషంట్లకు 25 శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. ఈ మేరకు సభ్యులందరూ సంఘం గుర్తింపు కార్డులను పొంది ఆసుపత్రిలో చూపించుకోవాలని సూచించారు. కలిసిన వారిలో రాజేందర్ అగర్వాల్, రాజేశ్ అగర్వాల్, రవీందర్ అగర్వాల్ పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు వేళాయె..



ఉత్సవాలకు ముస్తాబైన చెన్నకేశవ స్వామి దేవాలయం



చెన్నకేశవస్వామి

- రేపటి నుంచి గుడిలో మరూ
- చాళుక్యుల కాలంలో నిర్మించిన ప్రాచీన ఆలయం
- స్వామివారికి కానుకలు సమర్పించిన ఔరంగజేబు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని చారిత్రాత్మకమైన స్వయంభు లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్నది. మార్చి 2వ తేదీ నుంచి 6 వరకు వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ తరఫున ఆలయానికి రంగులు, వేస్తూ రంగురంగుల విద్యుద్దీపాలను అమరుస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ జుర్కి సంతోషి రాణి, సభ్యులు శ్రీనివాస్ గౌడ్, అర్చన, రవి రాహుల్, ఉమా మహేశ్వరీ, మీనాక్షి, చంద్రశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

చాళుక్య రాజుల కాలంలో నిర్మించిన ఆలయం

చాళుక్యుల కాలంలో చెన్నకేశవ స్వామి ఆలయాన్ని నిర్మించారు. అప్పట్లో ఏటా జరిగే బ్రహ్మోత్సవాలకు హైదరాబాద్ శివారు జిల్లాల భక్తులు ఎడ్లబండ్లపై వచ్చేవారు. కొద్దికాలనికి ఆలయం శిథిలావస్థకు చేరుకోగా ఈ గుడి గొప్పతనాన్ని తెలుసుకున్న అప్పటి నిజాం నవాబు మరింత అభివృద్ధి చేయించినట్లు చరిత్ర చెబుతుంది. తన సలహాదారుడు బన్సీరాజ్ బహదూర్‌ను ఆదేశించడంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. అంతేగాకుండా ఈ ఆలయానికి 16 గ్రామాల జాగీరును కూడా రాసిచ్చారు. నిజాం నవాబు ప్రభుత్వం తరఫున గుట్ట పైకి బ్యాండ్ మేళాల నడుమ పట్టువస్త్రాలు తీసుకువచ్చేవారు. ఈ ఉత్సవాల సమయంలో ఒక రోజు సెలవు దినంగా ప్రకటించేవారంటే ఉత్సవాల ప్రాముఖ్యత ఏ పాటిదో తెలుస్తుంది. దీంతో పాటు అటవీ మార్గం నుంచి ఔరంగాజేబు పహాడీషరీఫ్‌కు వెళ్తుండగా చాంద్రాయణగుట్ట దిగువకు రాగానే అతని గుర్రాలు ఆగిపోయాయని.. చెన్నకేశవ స్వామిని దర్శించుకోవాలని సేనాపతి సూచించారు. దీంతో ఆయన స్వామి వారిని దర్శించుకొని కానుకలు సమర్పించాకే అశ్వాలు ముందుకు కదిలినట్లు కథనం ప్రాచూర్యంలో ఉంది. నిజాం నవాబు కాలం అనంతరం కొన్ని దశాబ్దాల పాటు ఉత్సవాలు నిర్వహించలేదు. చివరకు 2005 నుంచి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం చాంద్రాయణ గుట్ట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పట్టు వస్త్రాలు సమర్పించడం అనవాయితీగా వస్తుంది.

'చెన్న రాయుని గుట్ట' నుంచి.... 'చాంద్రాయణ గుట్ట' గా..

విశాలమైన గుట్టపై చెన్నకేశవ స్వామి స్వయంభుగా వెలువడంతో ఈ ప్రాంతాన్ని మొదట చెన్నరాయుని గుట్టగా పిలిచేవారు. కాల క్రమేణా చాంద్రాయణగుట్టగా మారింది. కేశవ స్వామి పేరు మీద ఉండడంతో కేశవగిరి అని కూడా సంభోదిస్తారు. ఈ గుట్టపైనే శ్రీ మహా శివాలయం, శ్రీ చెన్న మల్లిఖార్జున భ్రమరాంబ ఆలయాలు కూడా ఉన్నాయి. ఇక్కడి భ్రమరాంబ దేవి గుహ లోపల ఉండడం విశేషం. చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో అండాళమ్మ, శ్రీ చతుర్భుజ ఆంజనేయ స్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. కల్యాణ మండపం వద్ద ఉన్న వృక్ష గణపతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఉత్సవాల సమయంలో గుట్టకు కిలోమీటర్ దూరంలో ఉన్న శ్వేతగంగ నీటిని తెచ్చి పూజలకు వినియోగించేవారు. ఈ గుట్టపై ఉన్న ఆలయాల ప్రస్తావన లింగ పురాణం, కేశవ పురాణం తదితర గ్రంథాల్లోనూ ఉండడం విశేషం.



శిల్పకళా వైభవానికి అద్దం పట్టేలా ఉన్న ఆలయ నిర్మాణం

వైభవంగా నిర్వహిస్తాం..



మార్చి 2వ తేదీన బాలభోగంతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. 3న రాత్రి స్వామివారు, అమ్మవార్ల ఎదుర్కోలు ఉంటుంది. 4న మధ్యాహ్నం 12 గంటలకు జరిగే కల్యాణోత్సవానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరుకానున్నారు. రాత్రి 8 గంటలకు స్వామి వార్ల ఊరేగింపు, 5న పారాయణం, 6న మహా పూర్ణాహుతి, దేవోద్వాసన, చక్రతీర్థం ధ్వజ అవరోహణ కార్యక్రమా ఉంటాయి. భక్తులకు ఇబ్బందుల్లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

–జుర్కి సంతోషి రాణి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్

ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేత



ప్రశంసా పత్రం అందజేస్తున్న స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే, నర్సింగ్‌రావ్

జియాగూడ: సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో ఇటీవల నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన 127 మంది విద్యార్థులకు టీడీపీ డివిజన్ అధ్యక్షుడు కె.నర్సింగ్‌రావుతో కలిసి ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను గురువారం అందజేసినట్లు స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే అన్నారు. అనంతరం బాల్‌రాజ్ కౌలే మాట్లాడుతూ.. ఏటా స్కూల్‌లో, వివిధ క్రీడాలు, ప్రదర్శనల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునేత్ర కౌలే, మహేశ్వరీ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కొరడా

నాంపల్లి: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనులపై ట్రాఫిక్ పోలీసులు కొరఢా ఝులిపించారు. రోడ్లపై అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలు, తోపుడు బండ్ల యజమానులపై మొత్తం 50 కేసులు నమోదు చేయడంతో పాటు చలాన్లు విధించినట్లు ఇన్‌స్పెక్టర్ ఆనంద్ తెలిపారు. ఏసీపీ బి.ఎర్నా ఆదేశాల మేరకు ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహారాణా ప్రతాప్ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అనిల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: బేగంబజార్ ఎంజే బ్రిడ్జి వద్ద మహారాణా ప్రతాప్ విగ్రహాన్ని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం మహారాణా ప్రతాప్ చేసిన పోరాటం మరవలేనిదన్నారు. కార్యక్రమంలో ఠాకూర్ సురేందర్ సింగ్, సచిన్ రాజ్ సింగ్, డి.సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోహిత్‌లాల్ కుటుంబాన్ని ఆదుకోవాలి

అఫ్జల్‌గంజ్: మేడారం జాతరలో ప్రమాదవశాత్తు మృతిచెందిన ఉస్మానియా ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్ రోహిత్‌లాల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నగర బీజేపీ నాయకుడు దుర్గేశ్ అవస్థి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ... రోహిత్‌లాల్ మృతితో అతని కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం వెంటనే ఆర్థిక సాయం అందజేయాలని కోరారు.

కార్వాన్‌కు మరిన్ని మినీ సివర్ క్లీనింగ్ మిషన్లు

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్



హకీంపేట్‌లో మినీ సివర్ మిషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్‌లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా మరిన్ని కొత్త మినీ సివర్ క్లీనింగ్ మిషన్లు మంజూరయ్యాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్ సెక్షన్‌కు మంజూరైన మినీ సివర్ క్లీనింగ్ వాహనాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా కొత్త పైపులైన్లు వేస్తున్నామని మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేసి వాటికి మూతలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సివరేజ్ క్లీనింగ్ కోసం ప్రస్తుతం ఉన్న మిషన్లు సరిపోవడం లేదని, దీంతో గతంలోనే తాను నియోజకవర్గానికి మరిన్ని మిషన్ల కోసం పంపిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపారని త్వరలోనే కొత్తవి వస్తున్నాయన్నారు. వేసవితో పాటు వర్షాకాలాన్ని సైతం దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, జలమండలి డీజీఎం ఖాజా జవహర్ అలీ తదితరులు ఉన్నారు.

మతసామరస్యానికి ప్రతీక గోల్కొండ



గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌తో ఎస్.రాజువస్తాద్

గోల్కొండ: శతాబ్దాల నుంచి గోల్కొండ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాదని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ప్రముఖ సంఘ సేవకుడు, గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ చైర్మన్ ఎస్.రాజువస్తాద్ గురువారం ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గోల్కొండలో మూడేళ్లుగా ఇన్‌స్పెక్టర్‌గా పని చేశానని, ఆ కాలంలో కులమతాలకు అతీతంగా ఎందరినో కలిశానని అన్నారు. మళ్లీ ఇక్కడికి ఏసీపీగా రావడం తన అదృష్టమని పేర్కొన్నారు. ఎస్.రాజువస్తాద్ మాట్లాడుతూ పీస్ అండ్ మైత్రి కమిటీ ఆవిర్భావం నుంచి గోల్కొండ పోలీస్ స్టేషన్ సభ్యుడిగా తాను పని చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, పీస్ అండ్ మైత్రి కమిటీ అధ్యక్షుడు హబీబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇలియాస్ అక్బర్ అలీ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యకు పుష్పగుచ్ఛం ఇస్తున్న లక్ష్మీనారాయణ

అబిడ్స్: వాటర్‌వర్క్స్ ఉద్యోగులు, అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామనిచేవెళ్ల ఎమ్మెల్యే, వాటర్ వర్క్స్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ కాలె యాదయ్య అన్నారు. గోషామహల్‌లోని యూనియన్ కార్యాలయంలో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాటర్‌వర్క్స్ ఉద్యోగులు, అధికారులకు తమ అసోసియేషన్ ప్రతినిధులు అందుబాటులో ఉండి అండగా నిలుస్తారన్నారు. నూతన కార్యవర్గ ప్రతినిధులను ఎమ్మెల్యే కాలె యాదయ్య, అలాగే అసోసియేషన్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయనను ప్రతినిధులు సన్మానించారు. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా జి.లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్‌గా బి.శంకర్ ప్రకాశ్, అధ్యక్షుడిగా డి.అశోక్, ప్రధాన కార్యదర్శిగా బి.నర్సింగ్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జి.సత్యనారాయణ, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.అశోక్, ఎన్.మొగులయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎ.ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.ప్రేమ్‌కుమార్, జి.శంకర్, డి.యాదగిరి, జాయింట్ జనరల్ సెక్రటరీగా ఎస్.హన్మంత్‌నాయక్, బి.రాజాబాబు, కె.శ్రీనివాస్, కోశాధికారిగా ఎస్.రాజు, సలహాదారులుగా కొండల్‌రావు, సి.రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు తెలిపారు.

చిన్నారెడ్డికి సన్మానం



చార్మినార్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన జి.చిన్నారెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు టీపీసీసీ కార్యదర్శి కె.ఎస్.ఆనంద్‌రావు తెలిపారు. అలాగే జ్యోతిరావు పూలే భవన్‌లో శాలువా కప్పి సన్మానించినట్లు పేర్కొన్నారు. కలిసిన వారిలో కంది అశోక్‌రెడ్డి, ఎం.వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కార్వాన్‌లో ల్యాండ్ మాఫియా



మాట్లాడుతున్న కార్వాన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజరీ

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ల్యాండ్ మాఫియాకు అడ్డు అదుపు లేకుండా పోతున్నదని కార్వాన్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజరీ అన్నారు. కార్వాన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ల్యాండ్ మాఫియా వెనుక పాత నగరానికి చెందిన ఓ రాజకీయ పార్టీ ఉందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ భూములతో పాటు కేంద్ర ప్రభుత్వానికి చెందిన చారిత్రాత్మక ప్రదేశాలను కూడా కబ్జా చేస్తున్నారన్నారు. గోల్కొండ కోట ప్రహారీని ఆనుకోని ఉన్న కందకాలను ఆక్రమించారని, అలాగు మోతీదర్వాజ వద్ద కందకాన్ని వ్యర్థాలతో మూసేసి ప్లాట్లుగా చేసి అమ్ముకునేందుకు సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు.అహ్మద్ కాలనీ మసీదు వద్ద ఉన్న నాలాను ఆక్రమించి అందులో వ్యర్థాలు నింపి చదును చేశారని తెలిపారు. కార్వాన్‌లోని చారిత్రక మసీదు స్థలంతో పాటు గోల్కొండ కుతుబ్‌షాహీ ఈద్గా వెనుకలో ప్రభుత్వ స్థలాన్ని కూడా కబ్జా చేశారని ఆరోపించారు. కబ్జా స్థలాల వివరాలు పూర్తిగా సేకరించి మంత్రి హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి పొన్నం ప్రభాకర్‌తో పాటు సీఎంకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమ్జద్, శోభాపాండే తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీశైలానికి ఏసీ బస్సులు

అఫ్జల్‌గంజ్: హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏసీ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చిందని రంగారెడ్డి రీజియన్ మేనేజర్ ఏ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 2 నుంచి రాజధాని ఏసీ బస్సులు బీహెచ్‌ఈఎల్, జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి మహాత్మాగాంధీ బస్ స్టేషన్ మీదుగా శ్రీశైలం చేరుకుంటాయని పేర్కొన్నారు. పెద్దలకు రూ 650, పిల్లలకు రూ 510 టికెట్ రేటు నిర్ణయించామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆస్తి పన్ను బకాయిలపై రుసుం మాఫీ

చార్మినార్: చార్మినార్ నియోజకవర్గ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులకు 2022–23 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన బకాయి అపరాధ రుసుంలో 90 శాతం రాయితీ ఇస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ చార్మినార్ సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్ సరిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కేవలం 10 శాతం అపరాధ రుసుం మాత్రమే చెల్లించాలని, గృహ, వాణిజ్య వినియోగదారులు వన్ టైం సెటిల్‌మెంట్ కింద సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

శాంతిభద్రతలకు సహకరించాలి



చార్మినార్ ఏసీపీ సుదర్శన్‌ను సన్మానిస్తున్న పీస్ కమిటీ ప్రతినిధులు

చార్మినార్: శాంతి భద్రతల పరిరక్షణకు శాంతి సంఘం సభ్యులు సహకరించాలని చార్మినార్ ఏసీపీ సుదర్శన్ అన్నారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను దక్షిణ మండలం పీస్ కమిటీ ప్రతినిధుల బృందం గురువారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీ కిషన్ శర్మ, మోహీద్దీన్, గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు, దక్షిణ మండలం శాంతి సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్, రెహమాన్, తేజు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో కలిసి మహిళ అదృశ్యం



కాంచన



సాన్వి, సాయినాథ్

సుల్తాన్‌బజార్: ఇద్దరు పిల్లలతో కలిసి ఓ మహిళ అదృశ్యమైన ఘటన గురువారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సతీశ్ బాబురావు మీర్జాపురె, అదే రాష్ట్రానికి చెందిన కాంచన (25) దంపతులు. వారికి సాన్వి (6), సాయినాథ్ (4) ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 25వ తేదీన మధ్యాహ్నం కాంచన తన ఇద్దరు పిల్లలతో కలిసి బయటకు వెళ్లిపోయింది. సతీశ్‌బాబురావు ఇంటికి వచ్చి చూసేసరికి ఎవరూ లేకపోవడంతో చుట్టుపక్కలా ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. అయితే కాంచన ఇంటిపక్క వారికి తాను సొంత ఇంటికి వెళ్లిపోతున్నానని మళ్లీ రానని చెప్పినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు కాంచన సొంత ఊరులో వాకాబు చేయగా అక్కడికి కూడా రాలేదని తెలిసింది.

మెరుగైన విద్యను అందించేందుకు కృషి



సమావేశంలో ప్రవీణ్‌కుమార్, రామ్ కట్టెల, చంద్రశేఖర్

అబిడ్స్: ఎక్సెల్ గ్లోబల్ సర్వీసెస్ (ఎక్స్‌జీఎస్) ఆధ్వర్యంలో భారతీయ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని ఎక్స్‌జీఎస్ గ్లోబల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఇండియా డైరెక్టర్ రామ్‌కట్టెల, సెయింట్ మార్టీన్ ఇంజినీరింగ్ కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ సంతోష్, గ్లోబల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆస్ట్రేలియాలోని స్విన్‌బర్న్ యూనివర్శిటీని గురువారం సందర్శించారు. గ్లోబల్ రిలేషన్‌షిప్ మేనేజర్ అడాలిన కోయెల్హోను కలిసి యూనివర్శిటీ అన్వేషణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతీయ ఆశావహుల కోసం ప్రోగ్రాంలు, ఎంబీసీ నియమకాల కోసమే సందర్శించామని తెలిపారు.

టీజీఓ కార్యవర్గ సభ్యులకు సన్మానం



టీజీఓ నేతలను సత్కరిస్తున్న జ్ఞానేశ్వర్, గంగాధర్

నాంపల్లి: నూతనంగా ఎన్నికైన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీఓ) రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ, సహాధ్యక్షుడు బి.శ్యామ్‌ను తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాంపల్లిలోని టీజీఓ భవన్‌లో సభ్యులకు పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీజీఓ కోశాధికారి ఉపేందర్‌రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం గౌరవాధ్యక్షుడు ఖాదర్ బిన్ హసన్, కోశాధికారి ధన్‌రాజ్, ఉపాధ్యక్షులు బి.రాజేందర్, పాపయ్య, ఎ.భరత్, విజయ్‌కుమార్, జి.శ్రీనివాస్, నగర శాఖ అధ్యక్షుడు పి.లక్ష్మణ రావు పాల్గొన్నారు.

నిలోఫర్‌లో అత్యాధునిక వైద్యసేవలు

- న్యూబార్న్ స్క్రీనింగ్ సెంటర్ ప్రారంభం
- ప్రాథమిక దశలోనే జన్యుపరమైన లోపాల గుర్తింపునకు అవకాశం



నవజాత శిశువు తల్లులతో మాట్లాడుతున్న కమీషనర్ ఆర్.వి. కర్ణన్

నాంపల్లి: నవజాత శిశు సంరక్షణా కేంద్రం నిలోఫర్‌లో మరో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. అప్పుడే పుట్టిన శిశువుకు ఐదు రకాల జన్యుపరమైన లోపాలతో కూడిన రోగాలను గుర్తించే ప్రక్రియ న్యూబార్న్ స్క్రీనింగ్ ప్రారంభమైంది. ఈ స్క్రీనింగ్ ద్వారా శిశువు పుట్టిన 24 గంటలు మొదలు 48 గంటలు పూర్తయ్యేలోగా థైరాయిడ్, హైపర్ ప్లాషియా, జీ6పీడీ డెఫిసిషియన్సీ, గాలక్టోసీమియా, డయో టివిడెన్ అనే ఐదు రకాలను రోగాలను గుర్తించి వాటి నివారణకు సరిపడే చికిత్సలు అందజేస్తారు. రాష్ట్రలో ఏకకాలంలో హైదరాబాదులోని నిలోఫర్‌తో పాటుగా సంగారెడ్డిలో ప్రారంభించారు. ఈ సేవలు ఇప్పటికే కేరళ, గోవా, చండీఘర్ రాష్ట్రాల్లో అమలవుతున్నాయి. మన రాష్ట్రంలో న్యూబార్న్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రారంభించడం ఇదే ప్రథమం. దీని ద్వారా ఒక రోజులో 800 మంది శిశువులకు రక్త పరీక్షలు నిర్వహించే సామర్థ్యం కలిగి ఉంటుంది. నిలోఫర్ ఆసుపత్రిలో రోజుకు 30–35 మంది శిశువులు జన్మిస్తుంటారు. ఈ కార్యక్రమాన్ని గురువారం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ ఆర్.వి. కర్ణన్ చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించారు. ప్రాథమిక దశలోనే రోగాలను గుర్తించేందుకు న్యూ బార్న్ స్క్రీనింగ్ ఎంతగానో దోహదపడుతుందని కర్ణన్ అన్నారు. శిశువుకు వ్యాధి నిర్ధారణ జరిగితే తల్లిదండ్రులకు కూడా పరీక్షలు నిర్వహించి ఆ వ్యాధి సంక్రమించిన విధివిధానాలను వైద్యులు తెలియజేస్తారని తెలిపారు. డీఎంఈలు డాక్టర్ వాణి, డాక్టర్ శివరామ ప్రసాద్‌లు మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు ముర్రు పాలు తాగించిన తర్వాత 24 గంటలు గడిస్తే శిశువుకు నిర్ధారణ పరీక్షలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, డాక్టర్ అలివేలు, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ జ్యోతి పాల్గొన్నారు.



నవజాత శిశువు

ఆకట్టుకున్న అకడమిక్ ఫెయిర్



అకాడమిక్ ఫెయిర్ ప్రదర్శనలో విద్యార్థులు

చార్మినార్: చార్మినార్ నారాయణ ఈ–టెక్నో స్కూల్ అకడమిక్ ఫెయిర్ ప్రదర్శనను గురువారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల ఎగ్జిబిట్లను ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ గౌస్ అహ్మద్ ఖాన్ పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల మేథస్సుకు పదును పెట్టాలన్నారు. కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాల పరమేశ్వర్, లక్ష్మీ గౌరి, స్కూల్ ప్రిన్సిపాల్ శారద, కో–ఆర్డినేటర్లు లక్ష్మీభవానీ, ఆజాద్, నూర్జహాన్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందిస్తాం

గన్‌ఫౌండ్రీ: ఎస్‌ఎం స్పైర్ క్రెడిట్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ నేరుగా వినియోగదారులకు రుణ సౌకర్యాన్ని అందించేలా రిజర్వు బ్యాంక్ అవకాశం కల్పించడం ఆనందంగా ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు అల్లూరి దిలీప్‌కుమార్, అవంతి అన్నారు. గన్‌ఫౌండ్రీలోని సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ లైసెన్స్‌ను రిజర్వ్ బ్యాంక్ తమ సంస్థకు అందించడంతో రాబోయే మూడేళ్లల్లో రూ.500 కోట్ల రుణా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. తమ సంస్థ ఈ స్థాయికి ఎదిగేందుకు సహకరించిన ఉద్యోగులు, వినియోగదారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్



ఎస్‌ఎం ముజీబ్ హుస్సేనిను సత్కరిస్తున్న రాజ్‌కుమార్, వైదిక్ శాస్త్రి

అబిడ్స్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీఓస్ యూనియన్ కృషి చేస్తున్నదని హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. జీఆర్‌పీ సికింద్రాబాద్ యూనిట్ అధ్యక్షుడిగా ఎన్నికైన సి.దినేశ్, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రావు, కార్యదర్శి శ్రీదేవితో పాటు ఇతర నేతల కమిటీ సభ్యులు గురువారం ముజీబ్ హుస్సేన్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన కొత్తగా ఎన్నికైన కమిటీకి అభినందనలు తెలిపారు. బంగారు తెలంగాణ సాధనకు ఉద్యోగులు చేస్తున్న కృషి అమోఘమన్నారు. కార్యక్రమంలో నవీన్, నరహరి, అహ్మద్‌భాషా, సుష్మి జాదవ్, సతీశ్‌కుమార్, అవినాశ్ రాజ్, సంగీత కేఆర్ రాజ్‌కుమార్, వైదిక్ శాస్త్రి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మేరు కులస్తులకు ప్రాధాన్యత ఇవ్వండి



కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: పార్లమెంట్ ఎన్నికల్లో మేరు కులస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ కోరారు. మేరు సంఘం ఆధ్వర్యంలో గురువారం టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుట్టు మిషన్లను అందించారు. అనంతరం మాట్లాడుతూ.. త్వరలోనే రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున్ కార్గే, సోనియాగాంధీని కలిసి తనకు మల్కాజ్‌గిరి పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తానన్నారు. కార్యక్రమంలో మునగల రమేశ్, కొత్తకొండ శ్రీను, రేణుకుంట వేణు, పురుషోత్తంరావు పాల్గొన్నారు.

మీడియా అకాడమీ చైర్మన్‌కు సన్మానం

సుల్తాన్‌బజార్: మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాస్ రెడ్డిని ప్రముఖ సంఘ సేవకుడు సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం సన్మానించి కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ.. శ్రీనివాస్‌రెడ్డి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు, ఆయన అభిమానులు పాల్గొన్నారు.

యువత సహకరించాలి

గోల్కొండ: శాంతిభద్రతల రక్షణ, పండుగలు, ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించడంలో యువత సహకరించాలని కుల్సుంపురా డివిజన్ ఏసీపీ మహ్మద్ మునావర్ కోరారు. గుడిమల్కాపూర్‌కు చెందిన కేసరి హనుమాన్ యువత సంఘటన్‌కు చెందిన వారు గురువారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. రక్షిత్‌సాగర్ తదితరులు ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684